# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 328 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 2 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 328 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 2 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## కూతురు రాజకీయ ఎంట్రీపై మంత్రి నారాయణ క్లారిటీ!



- తన కూతురు షరణి మేయర్‌గా పోటీ చేయదని నారాయణ స్పష్టీకరణ
- తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని వెల్లడి
- ప్రజా సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:తన కుమార్తె షరణి రాజకీయ ప్రవేశంపై వస్తున్న వదంతులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తెరదించారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని, తన కుమార్తె మేయర్‌గా పోటీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ, ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు.తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా తాను పట్టించుకోనని మంత్రి నారాయణ అన్నారు. "కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది"

- మిగతా 2లో

## 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!

### ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు..



- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు
- మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ
- ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

- మిగతా 2లో



## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

- గత ప్రభుత్వంపై రేపల్లె సభలో చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వెంటిలేటర్‌పై పెడితే, తాము ఆక్సిజన్ అందించి కాపాడామన్న సీఎం
- అమరావతిని ఎడారి, శ్మశానం అన్నారని.. పోలవరాన్ని గోదావరిలో ముంచేశారని ఫైర్
- బీసీల రిజర్వేషన్లకు గత ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డుపడిందని ఆరోపణ
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని స్పష్టం

పెన్ పవర్ డెస్క్:గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తెలుగుదేశం పార్టీ 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, గత 'గొడ్డలి పార్టీ' ప్రభుత్వం దాన్ని 24 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. "దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. మేము మళ్లీ 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తే, వాళ్లే కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారు. బీసీలపై ద్వేషంతోనే ఈ కుట్ర చేస్తున్నారు. అయినా మేం వెనకడుగు వేయం. రేపే సుప్రీంకోర్టుకు వెళుతున్నాం. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం" అని ఆయన స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "అప్పులు దొరక్కపోతే రాష్ట్ర ఆస్తులను తాకట్టు పెట్టారు. కనీసం మద్యపాన నిషేధం హామీని నిలబెట్టుకోకుండా, భవిష్యత్తులో 25 ఏళ్లపాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన దారుణమైన పరిస్థితిని సృష్టించారు. మేం అధికారంలోకి వచ్చాక ఆ అప్పుల వడ్డీ రేట్లను తగ్గించి, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం" అని వివరించారు. ముఖ్యమంత్రి అంటే సెక్రటేరియట్‌లో కూర్చోవడం కాదని, సామాన్యుడిలా ప్రజల మధ్య ఉంటూ

- మిగతా 2లో



## నెల రోజుల్లో డీఎస్సీ 2.0

### అధికారులకు మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

- నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదలకు ఆదేశం
- పదో తరగతి ఫలితాల కోసం 'మిషన్ మార్చ్' పకడ్బందీగా అమలు
- యూనివర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు
- స్కూల్ డ్రాపౌట్ల నివారణకు 'జీరో డ్రాప్ అవుట్ మిషన్'
- విశాఖలో ఏయూ శతాబ్ది ఉత్సవాల గుర్తుగా ప్రతిష్టాత్మక గ్రంథాలయం

పెన్ పవర్ డెస్క్:నెల రోజుల్లోపు డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పోస్టింగ్ ఉత్తర్వుల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు.

- మిగతా 2లో

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ



- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ

- మిగతా 2లో



## బీచ్‌లో విషాదం.. ఎనిమిది మంది విద్యార్థుల మృతి

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విహారయాత్రలో భాగంగా బీచ్‌కు వెళ్లిన విద్యార్థుల్లో ఎనిమిది మంది నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణె జిల్లాలోని ఓ ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు, సిబ్బంది రాయ్‌గఢ్ జిల్లాలోని దివేఅగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వెళ్లారు. వీరిలో 25 మంది బాలురు, 17 మంది బాలికలు, ఆరుగురు ఉపాధ్యాయులు సహా మొత్తం 48 మంది ఉన్నారు. ఈ క్రమంలోనే సముద్రంలో దిగిన ఎనిమిది మంది విద్యార్థులు నీటి

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లు: టీడీపీ, వైసీపీలపై విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు

- స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను రద్దు చేసిన హైకోర్టు
- 50 శాతం కోటా పరిమితిని దాటవద్దన్న సుప్రీం నిబంధనను గుర్తు చేసిన న్యాయస్థానం
- బీసీలను టీడీపీ, వైసీపీ మోసం చేస్తున్నాయన్న విజయసాయి



పెన్ పవర్ డెస్క్:బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలుగుదేశం, వైసీపీ నాటకాలాడుతున్నాయని, ఓట్ల కోసం బీసీలను మోసం చేస్తున్నాయని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి

- మిగతా 2లో

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కు కొత్త బాస్..

### ఎండీ, సీఈవోగా అనుప్ బగ్చీ నియామకం

- ప్రస్తుత సీఈవో శశిధర్ జగదీశన్ స్థానంలో నియామకం
- అక్టోబర్ 27 నుంచి మూడేళ్ల పాటు పదవిలో కొనసాగింపు
- బగ్చీ నియామకానికి ఆమోదం తెలిపిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- గతంలో ఐసీఐసీఐ గ్రూప్‌లో కీలక పదవుల్లో పనిచేసిన అనుభవం



- మిగతా 2లో



## ఫిల్మ్ ఛాంబర్‌లో హైడ్రామా

### ఫెడరేషన్ పెద్దలతో జానీ మాస్టర్ భార్య సుమలత వాగ్వాదం..

- ఫిల్మ్ ఛాంబర్ వద్ద సుమలత తీవ్ర వాగ్వాదం
- సమావేశంలోకి తనను అనుమతించకపోవడంపై ఆగ్రహం
- సుమలత నాయకత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేసిన ఫెడరేషన్
- అక్టోబర్ 18న డాన్సర్స్ అసోసియేషన్‌కు కొత్త ఎన్నికల ప్రకటన
- జానీ మాస్టర్‌పై సహాయ నిరాకరణ కొనసాగిస్తున్నట్లు స్పష్టీకరణ

- మిగతా 2లో

## చరిత్రకు జీవం: నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

- పాతబస్తీలోని చారిత్రక బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న పురాతన బావి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు ప్రారంభం
- నిజాంల కాలంలో ఔషధ గుణాలున్న నీటిని అందించిన బావిగా ప్రత్యేక గుర్తింపు
- వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన

- మిగతా 2లో



## కావాలంటే ఇప్పుడే నన్ను అరెస్ట్ చేసుకోండి: ఫడ్నవీస్‌కు అభిజీత్ దీప్కే సవాల్



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి అని ఆరోపణ
- అక్టోబర్ 2 నుంచి ముంబైలో ఆందోళనలకు పిలుపు
- పోలీసుల అనుమతి అవసరం లేదని స్పష్టం

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌పై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అక్టోబర్ 2 నుంచి తమ పార్టీ తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో, వ్యూహాత్మక తప్పులు చేయవద్దని ఆయన ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ? కావాలంటే తనను ఇప్పుడే అరెస్ట్ చేయాలని ఆయన సవాల్ విసిరారు.గురువారం ముంబైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దీప్కే మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు.యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు.1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# నెల రోజుల్లో డీఎస్సీ 2.0

- మొదటి పేజీ తరువాయి

ఏపీ రిక్రూట్‌మెంట్ మోడల్‌ను దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని, ఇతర రాష్ట్రాలు మన విధానాలను అనుసరించేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు.

పాఠశాల విద్యలో కీలక సంస్కరణలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బడి మానేసే పిల్లల సమస్యపై సింగపూర్ హోంమంత్రి షణ్ముగం చేసిన సూచనలను ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. డ్రాపౌట్ల నివారణలో సమాజంలోని పెద్దలను, స్థానిక ప్రముఖులను భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.ఉన్నత విద్యారంగంపై కూడా సమీక్షించిన లోకేశ్, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబరులో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాత పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రాష్ట్రంలో పలు ప్రతిష్ఠాత్మక ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, వాటికి అవసరమైన భూమిని గుర్తించాలని మంత్రి సూచించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీ భాగస్వామ్యంతో ఒక ప్రతిష్ఠాత్మక గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కావాలంటే ఇప్పుడే నన్ను అరెస్ట్ చేసుకోండి: ఫడ్నవీస్‌కు అభిజీత్ దీప్కే సవాల్

- మొదటి పేజీ తరువాయి

జ్ఞానేశ్ కుమార్‌ను "దేశద్రోహి"గా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారని, వారంతా రోడ్లపైకి వస్తే జ్ఞానేశ్ కుమార్ బాస్‌ల రాజీనామాను కూడా ప్రజలు డిమాండ్ చేస్తారని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేక సవరణ జాబితాను నిలిపివేసి, 2005 ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాలని దీప్కే డిమాండ్ చేశారు.ఆందోళనకారులను మూడు రోజుల పాటు జైల్లో పెడతామన్న ఫడ్నవీస్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, "నన్ను మూడు రోజులు కాదు, మూడు నెలల పాటు జైల్లో పెట్టండి, నేను మళ్లీ మళ్లీ వీధుల్లోకి వస్తూనే ఉంటాను" అని అభిజీత్ దీప్కే ఘాటుగా బదులిచ్చారు. నిరసనలకు పోలీసుల అనుమతి అవసరం లేదని, స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మా గాంధీ బ్రిటిష్ వారి అనుమతి అడగలేదని గుర్తుచేశారు. "శివాజీ పార్కులో ఫడ్నవీస్ ఓట్ల కోసం సభ నిర్వహించగలిగినప్పుడు, మేమెందుకు అదే వేదికపై నిరసన తెలపకూడదు?" అని ఆయన ప్రశ్నించారు.అక్టోబర్ 4న ప్రతిపక్షాలు నిర్వహించే ఉమ్మడి ఆందోళనకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని దీప్కే ప్రకటించారు. తాను దేశవ్యాప్త పర్యటనలో ఉన్నప్పటికీ, సీజేపీ కార్యకర్తలు ముంబైలో భారీ సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. తన రూ. 30,000 విలువైన బూట్లపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, తనకు స్తోమత ఉన్నందున వాటిని కొనుగోలు చేశానని, అదొక ఫ్యాన్ మూమెంట్ మాత్రమేనని కొట్టిపారేశారు.

# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

- మొదటి పేజీ తరువాయి

వారి కష్టాలు తీర్చడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు.

**అమరావతి జోలికెళితే మసైపోతారు!**

రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నాశనం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. "సైబరాబాద్‌ను నిర్మించిన అనుభవంతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనుకుంటే, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ నాటకాలకు తెరలేపారు. అమరావతిని ఎడారి, శ్మశానం అంటూ సర్వనాశనం చేశారు. కానీ రైతుల త్యాగాలు, ముక్కోటి దేవతల ఆశీస్సులతో అమరావతి నిలబడింది. ఇకపై అమరావతిని ఒక్క ఇంచు కూడా ఎవరూ కదిలించలేరు. ఆ ప్రయత్నం చేస్తే మసి అయిపోతారు" అని తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదావరిలో ముంచేశారని, తాము మళ్లీ దాన్ని బాగుచేసి వచ్చే ఏడాది మార్చి నాటికి ఫేజ్-1 పూర్తి చేసి కృష్ణా నదికి నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రతిపక్షంలో నిర్మాణాత్మక పోటీతత్వం ఉండాలి గానీ, గత ప్రభుత్వంలో కుట్రతత్వం మాత్రమే ఉందని చంద్రబాబు విమర్శించారు. "మేం పరిశ్రమలు తెస్తే, వాళ్లు పారిశ్రామికవేత్తలను తరిమికొట్టారు. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. వ్యాన్‌పిక్ వంటి ప్రాజెక్టులను అవినీతితో నాశనం చేసి, ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నారు. ఇప్పుడు సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నారు. మేం రోడ్లు వేస్తే వాళ్లు గుంతలు తవ్వారు. పట్టాదారు పాసుపుస్తకాలపై, సర్వే రాళ్లపై కూడా వాళ్ల బొమ్మలు వేసుకొని రూ.800 కోట్లు దుర్వినియోగం చేశారు" అని ఆరోపించారు. వీటన్నింటినీ సరిచేసి, భూ సమస్యలకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు.

**పాలనలో మార్పులు, అభివృద్ధి మంత్రం**

తాము కేవలం బటన్ నొక్కి డబ్బులు పంచే ప్రభుత్వం కాదని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శి కుటుంబాలు, బంగారు కుటుంబాల పేరిట ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. 'ఆరోగ్యం, ఆదాయం, ఆనందం' అనే మూడు సూత్రాలతో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని ప్రజల భాగస్వామ్యంతో సాధిస్తామని చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.

**మోదీ, పవన్‌తో కలిసే హామీ ఇచ్చాం!**

2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రజల వద్దకు వచ్చామని, రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తుచేశారు. ఆ నమ్మకంతోనే ప్రజలు కూటమికి 54% ఓట్లు, 94% సీట్లతో చారిత్రక విజయాన్ని అందించారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తాము బాధ్యతగా స్వీకరించామని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ ప్రజలకు సేవకులే తప్ప పెత్తందారులు కాదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. రైల్వే స్టేషన్‌లో టీ అమ్మిన ఒక సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి, తన సమర్థతతో దేశ ప్రధాని స్థాయికి ఎదిగారని కొనియాడారు. ప్రజాస్వామ్యంలో ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా మోదీ నిలిచారని పేర్కొన్నారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎన్నో విజయాలు సాధిస్తోందని, ఆ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 2024లో లభించిన చారిత్రక తీర్పు వెనుక ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో ఉన్న మైత్రి కీలక పాత్ర పోషించిందని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది.అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది.మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

# ఫిల్మ్ ఛాంబర్‌లో హైడ్రామా: ఫెడరేషన్ పెద్దలతో జానీ మాస్టర్ భార్య సుమలత వాగ్వాదం..

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో వివాదం రాజుకుంది. డాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న విభేదాలు తారాస్థాయికి చేరాయి. గురువారం హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలుగు ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ముఖ్య నాయకుల సమావేశం జరుగుతుండగా, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలత లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, ఆమెను లోనికి అనుమతించకపోవడంతో ఫెడరేషన్ పెద్దలతో ఆమె తీవ్ర వాగ్వాదానికి దిగారు.డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఎన్నికైన తనను కీలక సమావేశానికి పిలవకపోగా, కనీసం లోపలికి కూడా రానివ్వకపోవడంపై సుమలత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ నాయకులు తమ సంఘం ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారంటూ ఫిల్మ్ ఛాంబర్ బయట ఆందోళన చేపట్టడంతో అక్కడ గందరగోళం ఏర్పడింది. ఇదిలా ఉండగా, ఇటీవల డాన్సర్స్ అసోసియేషన్‌లో తలెత్తిన వివాదాల నేపథ్యంలో సుమలత నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. అంతేకాకుండా, అక్టోబర్ 18న అసోసియేషన్‌కు కొత్తగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు

స్పష్టం చేసింది. అయితే, ఫెడరేషన్ తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం చట్టవిరుద్ధమని, తమను కావాలనే అణచివేస్తున్నారని సుమలత వర్గం ఆరోపిస్తోంది.

మరోవైపు, ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై గతంలో విధించిన 'సహాయ నిరాకరణ' నిర్ణయాన్ని కొనసాగిస్తున్నట్లు ఫెడరేషన్ తేల్చి చెప్పింది. ఈ పరిణామాలతో డాన్సర్స్ అసోసియేషన్ వివాదం మరింత ముదురుతోంది. ఫెడరేషన్ చర్యలపై న్యాయపరంగా పోరాడతామని సుమలత, జానీ మాస్టర్ మద్దతుదారులు హెచ్చరిస్తున్నారు.

# చరిత్రకు జీవం: నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

హైదరాబాద్ నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అడుగడుగునా చారిత్రక వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం. ముఖ్యంగా పాతబస్తీ గల్లీల్లో తిరిగితే శతాబ్దాల నాటి కథలు మనల్ని పలకరిస్తాయి. అలాంటి ఓ అద్భుతమైన చారిత్రక కట్టడానికి ఇప్పుడు పునరుజ్జీవం లభిస్తోంది. శివరాంపల్లిలోని 356 ఏళ్ల నాటి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఇటీవలే పునరుద్ధరించి నగరానికి ఓ మణిహారంగా అందించిన 'హైడ్రా', ఇప్పుడు అదే చెరువు కింద ఉన్న ఓ పురాతన ఊట బావికి ప్రాణం పోస్తోంది. నిజాం నవాబులు సైతం ఔషధ గుణాలున్నాయని భావించి ఈ బావి నీరు తాగినట్టు చరిత్ర చెబుతోంది. అంతటి విశిష్టత కలిగిన ఈ బావి, కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా దీని పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది.

**సీఎం ఆదేశాలతో వేగంగా అడుగులు**

గత మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆ సమయంలోనే చెరువుకు ఆనుకుని ఉన్న ఈ చారిత్రక బావి ప్రాముఖ్యతను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీని చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, తక్షణమే బావిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. చెరువు అభివృద్ధి పనులను విజయవంతంగా పర్యవేక్షించిన 'విమోస్ టెక్నోక్రాట్స్' సంస్థకే ఈ బావి పునర్నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతుండగా, మరో రెండు, మూడు నెలల్లో ఈ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

**ఘనమైన చరిత్ర.. మరుగునపడిన వైభవం**

ఒకప్పుడు వంద ఎకరాల్లో విస్తరించిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, కాలక్రమేణా కబ్జాలకు గురై కేవలం 4 ఎకరాలకు పరిమితమైంది. దీనిపై దృష్టి సారించిన హైడ్రా, హెచ్‌ఎండీఏ లెక్కల ప్రకారం 17 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విడిపించి చెరువుకు జీవం పోసింది. ఈ చెరువు కింద 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ఘనమైన చరిత్ర ఉంది. మూడవ నిజాం సికందర్ జా పాలనలో (సుమారు 1770) ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరు మీదుగా ఈ చెరువును నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.చెరువు పరిసరాల్లోని ఔషధ మొక్కల వేర్ల నుంచి ప్రవహించే నీరు, సహజ సిద్ధంగా వడపోతకు గురై ఈ బావిలోకి చేరేదని, అందువల్ల ఈ నీటికి అద్భుతమైన ఔషధ గుణాలుండేవని చరిత్రకారులు చెబుతారు. ఈ స్వచ్ఛమైన నీటిని నిజాం పాలకులు తాగేవారని, ఎడ్ల బండ్లపై సుదూర ప్రాంతాలకు, చివరకు లండన్‌కు కూడా తరలించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. కానీ కాలక్రమేణా ఈ బావి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టితో నిండిపోయి తన నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయింది.

**వారసత్వ సంపద పరిరక్షణే లక్ష్యం**

హైడ్రా ఈ బావి పునరుద్ధరణను కేవలం ఒక కట్టడాన్ని బాగుచేయడంగా కాకుండా వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాల సమన్వయంగా భావిస్తోంది. నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక సంపదను తిరిగి ప్రజలకు అందించి, భవిష్యత్ తరాలకు నగర జల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, దాని కింద ఉన్న ఔషధ గుణాల బావి.. ఇవి హైదరాబాద్‌లోని ప్రకృతి ఆధారిత వైద్య విధానాలకు, నీటి సంరక్షణ జ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఈ పునరుద్ధరణతో ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం జరుగుతోంది.

# కూతురు రాజకీయ ఎంట్రీపై మంత్రి నారాయణ క్లారిటీ!

- మొదటి పేజీ తరువాయి

అంటూ తనపై విమర్శలు చేస్తున్న వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు.అంతకుముందు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి నారాయణ వివరించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో వేలాది మందికి శాశ్వత నివాస ధ్రువీకరణ పట్టాలు అందించామని చెప్పారు. నెల్లూరులో ఇప్పటికే 1,450 మందికి పట్టాలు ఇచ్చామని, త్వరలోనే మరో 1,250 మందికి అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బీచ్‌లో విషాదం.. ఎనిమిది మంది విద్యార్థుల మృతి

- మొదటి పేజీ తరువాయి

లోతు, ప్రవాహాన్ని అంచనా వేయలేక కొట్టుకుపోయారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు.. ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశాయని పోలీసులు తెలిపారు.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కు కొత్త బాస్..

దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీకి నూతన సారథి రానున్నారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా అనుప్ బగ్చీని నియమిస్తున్నట్లు బ్యాంక్ బోర్డు ప్రకటించింది. ప్రస్తుత ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.అనుప్ బగ్చీ నియామకంతో పాటు ఆయన వేతన ప్యాకేజీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అక్టోబర్ 1న ఆమోదం తెలిపింది. ఆయన 2026 అక్టోబర్ 27 నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. బగ్చీ పదవీకాలం 2029 అక్టోబర్ 26న ముగుస్తుంది. ప్రస్తుత సీఈవో శశిధర్ జగదీశన్ పదవీకాలం 2026 అక్టోబర్ 26తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం ఖరారైంది.ఐఐటీ కాన్పూర్, ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన అనుప్ బగ్చీకి బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. గతంలో ఆయన ఐసీఐసీఐ గ్రూప్‌లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవోగానూ ఆయన సేవలందించారు. బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవం కలిగిన బగ్చీ నాయకత్వంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరింత పురోగతి సాధిస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# బీసీ రిజర్వేషన్లు: టీడీపీ, వైసీపీలపై విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు

- మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.ఈ తీర్పుపై విజయసాయి రెడ్డి స్పందిస్తూ... రెండు పార్టీలు ఇదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. "చట్టపరంగా నిలబడవని తెలిసి కూడా రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటేలా ప్రభుత్వం జీవోలు ఇవ్వడం, ఆ తర్వాత దానికి వ్యతిరేకంగా వెనువెంటనే కోర్టుల్లో కేసులు వేయించడం వీరికి పరిపాటిగా మారింది" అని ఆయన ఆరోపించారు. ఈ విధంగా బీసీలను మభ్యపెట్టి, కోర్టు తీర్పులు రాగానే ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# రూరల్ ప్రాంతంలో అభివృద్ధి స్థలాలపై క్షేత్రస్థాయి పరిశీలన


పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:**రూరల్ నియోజకవర్గ పరిధిలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, క్రీడా సదుపాయాలు, ప్రజా ప్రయోజన ప్రాజెక్టులను అభివృద్ధి కి అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించడానికి గురువారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. తూర్పు గోదావరి జిల్లా పునర్వ్యవస్థీకరణ అనంతరం జిల్లా స్థాయి సమావేశాలు, సదస్సులు నిర్వహించేందుకు అవసరమైన కన్వెన్షన్ సెంటర్, యువత, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ స్టేడియం, ప్రజలకు ఉపయోగపడే సేంద్రియ కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. బొమ్మూరు చెరువు అభివృద్ధి, మహిళా ప్రాంగణం, పాలిటెక్నిక్ కళాశాల వెనుక ప్రాంతాలను కూడా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సమీపంలో భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే ప్రభుత్వ స్థలాలను గుర్తించి, సద్వినియోగం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తెలుగు యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో ఉన్న భూముల హద్దులు, ప్రభుత్వ స్థలాలు, ప్రస్తుతం ఉన్న నిర్మాణాలు, వినియోగంలో ఉన్న ప్రాంతాలను పరిశీలించి వివరాలతో మ్యాప్ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రూరల్ ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా మౌలిక వసతులు అవసరమని తెలిపారు. యువతకు క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి, సదుపాయాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా స్థాయి సమావేశాలు, సదస్సులు నిర్వహించేందుకు తగిన కన్వెన్షన్ సెంటర్ స్థలాన్ని గుర్తించి ప్రణాళిక రూపొందించాలని కోరారు. బొమ్మూరు చెరువును తీర్చిదిద్దాలని సూచించారు. . తెలుగు యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో ఆక్రమిత స్థలాలు గుర్తించాలని, ఆక్రమణదా రులకు ప్రత్యామ్నాయ స్థలాలు పరిశీలించాలని, అర్హులకు టిడ్కో గృహాల కేటాయింపుల చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే అధికారులు, సిబ్బంది ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాలు, భూముల హద్దులు, రహదారులు, వివిధ సంస్థలకు కేటాయించిన భూముల వివరాలను మ్యాప్ ద్వారా మండల సర్వేయర్ భువనేశ్వర్ వివరించారు. ఈ పర్యటనలో సహాయ కలెక్టర్ కె. ఆదిత్య శర్మ, ఎంపీడీఓ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, మండల సర్వేయర్ భువనేశ్వర్, రూరల్ మండలం తెదేపా అధ్యక్షులు మత్శేటి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి మజ్జి పద్మావతి, నియోజకవర్గ పరిశీలకులు కె. శ్రీనివాస్ యాదవ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి



# సబ్ కలెక్టర్ శుభం నొక్వల్‌కు ఘన వీడ్కోలు



**చింతూరు, పెన్ పవర్, అక్టోబర్ 1:**చింతూరు సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న శుభం నొక్వల్‌కు గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన సబ్ కలెక్టర్ సీహెచ్. నరేంద్ర పడాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ. చింతూరు సబ్ డివిజన్‌లో శుభం నొక్వల్ సమర్థవంతంగా విధులు నిర్వహించారని అన్నారు. ముఖ్యంగా పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీల అమలులో భాగంగా 10,881 మంది నిర్వాసితులకు ప్రయోజనాలు అందించడంలో, అలాగే సుమారు 6,000 ఎకరాల భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలతో సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి, పునరావాస కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో శుభం నొక్వల్ చూపిన చొరవ అభినందనీయమన్నారు. నూతన బాధ్యతల్లో కూడా ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. శుభం నొక్వల్ మాట్లాడుతూ. చింతూరు ప్రాంతంలో విధులు నిర్వహించిన కాలం తనకు ఎంతో విలువైన అనుభవాన్ని అందించిందన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల సహకారంతో పునరావాసం, భూసేకరణ తదితర కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలిగామని తెలిపారు. తనకు సహకరించిన జిల్లా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, వివిధ శాఖల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధికారులు శుభం నొక్వల్‌ను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. నూతన సబ్ కలెక్టర్ సీహెచ్. నరేంద్ర పడాల్‌కు అధికారులు శు భాకాంక్షలు తెలిపారు.



# పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యానికి తావులేదు

**ప్రతి నెల 1వ తేదీనే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందాలి**

**లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించిన కలెక్టర్ కె. దినేష్‌కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 01:**పోలవరం జిల్లాలో ప్రతి నెల 1వ తేదీన వివిధ రకాల లిలిఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు సకాలంలో అందించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్ తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గురువారం రంపచోడవరం మండలం పెద్దగెద్దాడ గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వివిధ కేటగిరీలకు చెందిన పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ప్రతి నెల ఒకటో తేదీన సామాజిక భద్రత పింఛన్లు అందేలా గ్రామాల వారీగా సిబ్బందిని నియమించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందించడంతో పాటు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.పింఛన్లు ప్రతినెల సకాలంలో అందుతున్నాయా? లేదా? అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం లబ్ధిదారులకు సక్రమంగా చేరుతోందా? అనే విషయాలను కలెక్టర్ స్వయంగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.పోలవరం జిల్లాలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో అర్హులైన పింఛన్ లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో పింఛన్లు అందించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర సామాజిక భద్రత పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సకాలంలో చేరేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.కలెక్టర్ వెంట తహసీల్దార్ సీహెచ్. బాలాజీ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకర్‌రావు, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, ఏపీఎం శ్రీరామ్, డిజిటల్ అసిస్టెంట్ కథల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో మార్పు



- అక్టోబర్ 10 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం
- 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 01:**ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ షెడ్యూల్‌లో భారత ఎన్నికల సంఘం మార్పులు చేసినట్లు పోలవరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో సవరించిన షెడ్యూల్ వివరాలను వెల్లడించారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాకు సంబంధించి స్వీకరించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను అక్టోబర్ 10వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం అక్టోబర్ 16వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను జిల్లాలోని సంబంధిత అధికారులకు, సిబ్బందికి తెలియజేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రజలకు సమాచారం అందేలా అన్ని మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సవరించిన షెడ్యూల్‌ను జిల్లాలోని రాజకీయ పార్టీలకు కూడా లిఖితపూర్వకంగా తెలియజేయనున్నట్లు కలెక్టర్ కె.దినేష్ కుమార్ వెల్లడించారు.

# పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- స్వచ్ఛ పక్వాడ్‌లో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి
- ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన సమాజం సాధ్యం



**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 01:**పరిశుభ్రత అనేది కేవలం ఒక శాఖకు మాత్రమే సంబంధించిన అంశం కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. గురువారం మారేడుమిల్లి మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి పర్యవేక్షణలో స్వచ్ఛ భారత్--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. స్వచ్ఛతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఇటువంటి పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి, డీఎస్పీ పి.ఆసరఫ్ అలీ పర్యవేక్షణలో సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొన్నారు. రోడ్లను శుభ్రం చేస్తూ పారిశుద్ధ్య కార్యక్రమానికి తన వంతు సహకారం అందించారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పరిశుభ్రత కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసు సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించగలమన్నారు.కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సీఐ చెలముత్తు, మారేడుమిల్లి సీఐ బి.నరసింహమూర్తి, ఎస్ఐ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ




- గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేత
- పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్న కూటమి నాయకులు, అధికారులు





**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:**పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర సామాజిక భద్రత లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.గంగవరం పంచాయతీ పరిధిలోని పాత గంగవరం, ఆమదాలబంధ పంచాయతీ పరిధిలోని రాజంపాలెం గ్రామాల్లో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ సారపు సత్యవేణి, గ్రామ కమిటీ కార్యదర్శులు వీరావతుల రాజేంద్రప్రసాద్, వీఓఏ నాగమణి, సచివాలయ కార్యదర్శి గోపీనాథ్ కృష్ణ, మహిళా పోలీస్ జయలక్ష్మి, వెటర్నరీ సిబ్బంది నాగేశ్వరరావు, డీఏ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కొత్త గంగవరం లో జరిగిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బుల్లియమ్మ మాజీ సర్పంచ్ అక్కమ్మ జనసేన అధ్యక్షుడు సిద్దు తదితరులు పాల్గొన్నారుఅదేవిధంగా ఇ.రామవరం, ఎండపల్లి, జడేరు గ్రామాల్లోనూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గంగవరం మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, రేవుల అబ్బాయిరెడ్డి, పల్లాల రాంరెడ్డి, యాట్ల లింగారెడ్డి, చెక్క సాయి దుర్గ, బూత్ ఇన్‌చార్జి చెక్క రాజారెడ్డి తదితరులు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

**కొత్తాడలో పింఛన్ల పంపిణీని పరిశీలించిన ఎంపీడీవో**

కొత్తాడ గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గంగవరం ఎంపీడీవో లక్ష్మణరావు పరిశీలించారు. లబ్ధిదారులకు పింఛన్లు సక్రమంగా అందుతున్న తీరును పరిశీలించి, పంపిణీ ప్రక్రియపై సిబ్బందికి సూచనలు చేశారు.మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత





**సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు**

**బాధ్యతలు స్వీకరించిన నూతన సబ్ కలెక్టర్ డి. పృద్వీరాజ్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:** రంపచోడవరం సబ్ డివిజన్ పరిధిలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమర్థవంతమైన చర్యలు చేపడతామని నూతన సబ్ కలెక్టర్ డి. పృద్వీరాజ్ కుమార్ తెలిపారు. గురువారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన నూతన సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంపచోడవరం డివిజన్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యూపీఎస్సీ--2023లో 493వ ర్యాంకు సాధించిన తాను 2024 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యానని తెలిపారు. గతంలో శ్రీకాకుళం జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ ఆదేశాలు, సూచనలను పాటిస్తూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా, అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో అమలయ్యేలా కృషి చేస్తానన్నారు.

### అధికారుల ఘన స్వాగతం

నూతన సబ్ కలెక్టర్‌గా ఉదయం 10 గంటలకు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు సీహెచ్. బాలాజీ, ఎ. సత్యనారాయణ, స్వామి, సీహెచ్. శ్రీనివాసరావు, అమ్మాజీ, తేజస్విని, రామచంద్రరావు, శ్రీరాములు, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో ఎ. సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, సీనియర్ సహాయకులు డి. ఇందిరాబాయి, అలెగ్జాండర్, యూనిస్, రామకృష్ణ, అశోక్, దాసు తదితరులు పాల్గొన్నారు.

### మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు

నూతన సబ్ కలెక్టర్ డి. పృద్వీరాజ్ కుమార్‌ను రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి షేక్ పాయాజ్ భాష, రంపచోడవరం తహసీల్దార్ సీహెచ్. బాలాజీ, రెవెన్యూ అసోసియేషన్ హడాక్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ తహసీల్దార్లు వి. రవీంద్రబాబు, సునీత, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్. నిర్మల, టి. లక్ష్మణరావు, సీనియర్ సహాయకులు కె. వెంకటేశ్వర్లు, ఇందిరాబాయి, అలెగ్జాండర్, సీహెచ్. చంటి తదితరులు నూతన సబ్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఏకలవ్య పాఠశాలల్లో మూడు పోస్టులు తొలగింపు



* సవరించిన ప్రకటనను గమనించాలి
* అక్టోబర్ 3, 6న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:** పోలవరం జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వాక్-ఇన్ ఇంటర్వ్యూల ద్వారా భర్తీ చేసేందుకు గతంలో జారీ చేసిన ప్రకటనలో మార్పులు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఏకలవ్య పాఠశాలల్లో ఖాళీగా ఉన్న మొత్తం 26 పోస్టులకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సెప్టెంబరు 29న జాయింట్ కలెక్టర్ కార్యాలయం ద్వారా ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే గురుకులం కార్యదర్శి 30.09.2026న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ 26 పోస్టుల్లోని మూడు పోస్టులను తొలగించాల్సి వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ వెల్లడించారు.

తొలగించిన పోస్టుల్లో టీజీటీ తెలుగు--2, పీజీటీ తెలుగు--1, పీజీటీ ఇంగ్లిష్--1 పోస్టులు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు ఈ సవరణను తప్పనిసరిగా గమనించి, మార్పులకు అనుగుణంగా వాక్-ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. అక్టోబరు 3, 2026న ఏకలవ్య పాఠశాల, అడ్డతీగలలో, అక్టోబరు 6, 2026న ఏకలవ్య పాఠశాల, చింతూరులో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు సవరించిన పోస్టుల వివరాలను పరిశీలించి, సంబంధిత విద్యార్హతలు మరియు ఇతర అర్హతలు ఉన్న వారు మాత్రమే నిర్ణీత తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. గత ప్రకటనలోని 26 పోస్టుల వివరాలను యథాతథంగా పరిగణించకుండా, తాజాగా జారీ చేసిన సవరణ ప్రకటనను పరిగణనలోకి తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ స్పష్టం చేశారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు




**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హత ఉండి ప్రయోజనం పొందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడం 'పేదల సేవలో 2.0' కార్యక్రమ ప్రధాన లక్ష్యమని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. అర్బన్ నియోజకవర్గం వెంకట రామయ్య నగర్లోని వార్డు సచివాలయంలో గురువారం 'పేదల సేవలో 2.0' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని అర్హులైన వారికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? ఆయా పథకాల ద్వారా కలిగిన ఆర్థిక ప్రయోజనం, జీవనోపాధిలో మార్పు, అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు, చర్యలను గుర్తించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. వెల్లడించారు. ప్రజ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను నమోదు చేసి, వాటి పరిష్కారాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలిం గేశ్వర్, స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంలో డ్రోన్ తో పిచికారీ - రైతులకు క్షేత్ర ప్రదర్శన





**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 01:-** వరి పొలంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై డ్రోన్ ద్వారా పిచికారి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రకృతి వ్యవసాయం ఇంచార్జ్ లగుడు దేవి రైతులకు ప్రకృతి ద్రావణాల తయారీ, వాడకంపై వివరించారు. రైతులు తక్కువ ఖర్చుతో పొలంలోనే తయారు చేసుకోగలిగే దశపర్ణి కషాయం, బయో కల్చర్, పంచగవ్య, కోడిగుడ్డు - నిమ్మరసం ద్రావణం,

మీనామృతం వంటి ప్రకృతి ద్రావణాలను ఈరోజు డ్రోన్ ద్వారా రంప ఎర్రం పాలెం గ్రామానికి చెందిన చెక్కిరెడ్డి రామచంద్రరావు మరియు వీరబాబుల సంబంధించి పది ఎకరాల వరి పంటపై పిచికారీ చేసి చేయించారు రసాయనాలకు ప్రత్యామ్నాయంగా ఈ ద్రావణాలు ఎలా పనిచేస్తాయో రైతులకు క్షుణ్ణంగా వివరించారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల 10 నిమిషాల్లో ఎకరం పొలం పూర్తవుతుందని, కూలీల కొరత తీరుతుందని, మందు పంటపై సమానంగా పడి తెగుళ్ళు, చీడపీడల నివారణ బాగా జరుగుతుందని లగుడు దేవి తెలిపారు. రసాయనాలు వాడటం వల్ల భూమి చౌడు బారిపోతుందని, ప్రకృతి వ్యవసాయం తో భూసారం పెరిగి, అధిక దిగుబడి వస్తుందని సూచించారు. సేంద్రియ ప్రకృతి వ్యవసాయం వల్ల సకల జీవరాశి ఆరోగ్యంగా ఉంటుందని ప్రతి ఒక్కరు ప్రకృతి సేద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వ్యవసాయం చేస్తే ఆరోగ్యానికి ఆరోగ్యం లాభానికి లాభం రావడమే కాకుండా భూమి కూడా సారవంతంగా ఉండి సకాలంలో వర్షాలు పడుతూ సకల జీవకోటికి రక్షణగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ గోకవరం మండల ఇన్చార్జి లగుడు దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో రంప ఎర్రం పాలెం ఐ సి ఆర్ పి లు మాధవి,, దొరబాబు,, నళిని,,రైతులు చిక్కిరెడ్డి వీరబాబు,, చిక్కిరెడ్డి రామచంద్రరావు లతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 50వ వార్డులో కాశి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:** స్థానిక 50వ వార్డులో గురువారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. టీడీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ స్థానిక కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి పెన్షన్లు అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోంద న్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాప్యం లేకుండా పెన్షన్లు అందేలా టీడీపీ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తు న్నారని తెలిపారు. పారదర్శక పాలన, సంక్షేమ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు

## గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి



**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 1 :** మండలంలో పెదవులంపాడు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పండుదొర గుండెపోటుతో మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పండు దొర అడ్డతీగల మండలం వెదురు నగరం గ్రామంలో ఉన్న విశ్వహిందూ పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఉదయం గుండెపోటు రావడంతో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అప్పటికే ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని అన్నారు. తుదిసారిగా భౌతిక కాయాన్ని పాఠశాల కరస్పాండెంట్ భవన్ నారాయణ, సాటి ఉపాధ్యాయులు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, పండు దొర భౌతికకాయాన్ని సందర్శించే నివాళులర్పించారు. తలలో నాలుకలా ఉండే పండు దొర మాస్టారు గుండెపోటుతో మరణించడం బాధాకర విషయం అని పలువురు అంటున్నారు. స్వగ్రామమైన పెదవులంపాడులో దహన సంస్కారాలు చేశారని తెలిపారు.

## వృద్ధుల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన

* న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
* జేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ మురళి గంగాధరరావు






**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 01:** వృద్ధుల హక్కుల పరిరక్షణకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జేఎఫ్‌సీ మేజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ ఎం.మురళి గంగాధరరావు సూచించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రంపచోడవరంలోని రాష్ట్ర కవులు, కళాకారుల తెలుగుతల్లి వృద్ధాశ్రమంలో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ మురళి గంగాధరరావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు ఉన్న హక్కులు, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందుతున్న న్యాయ సహాయం, వివిధ సంక్షేమ పథకాలపై వృద్ధులకు అవగాహన కల్పించారు. వృద్ధులు తమ హక్కులను తెలుసుకుని, అవసరమైన సందర్భాల్లో న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వసతులను పరిశీలించిన ఆయన.. అక్కడి వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధ మహిళలకు చీరలు, పురుషులకు లుంగీలు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.వి.ఆర్. ప్రకాష్, యాళ్ల శ్రీనివాస్‌రావు, చుక్క సంతోష్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, టి.వీరబాబు, గౌరీశంకర్, వృద్ధాశ్రమం కమిటీ యాజమాన్య ప్రతినిధి నటరాజ్, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దివంగత స్పీకర్ బాలయోగి కి తెలుగుదేశం పార్టీ నాయకులు నివాళి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:** నేటితరం పాలకులకు దివంగత లోక్ సభ మాజీ స్పీకర్, జి ఎం సి బాలయోగి ని ఆదర్శంగా తీసుకోవాలని గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ అన్నారు. జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా కంబాల చెరువు పార్కులో ఉన్న ఆయన కాంస్య విగ్రహం వద్ద గన్ని కృష్ణ ఆధ్వర్యంలో గన్ని కృష్ణతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, దళిత నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ , లోక్ సభ స్పీకర్ గా ఎదిగినప్పటికీ సామాన్య కార్యకర్తను కూడా మర్యాదగా పలకరించే వారిని గుర్తు చేశారు. నేటి పాలకులు ఆయన నాయకత్వ లక్షణాలను, కార్యకర్తల పట్ల అనుసరించాల్సిన విధానాన్ని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కంబాల చెరువు పార్కు మళ్ళీ దుర్గంధంగా మారిందని విమర్శలు వస్తున్న నేపథ్యంలో పాలకులు దృష్టి సారించి ఆహ్లాదకరంగా మార్చాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మల్ల వెంకట్ రాజు, గంగిన హనుమంతరావు, ఎం శ్రీనివాస్( కాపు), కురగంటి సతీష్, ఉప్పులూరి జానకిరామయ్య,జక్కంపూడి అర్జున్,మాజీ కార్పొరేటర్లు తలారి ఉమాదేవి ,జవ్వాది మురళీకృష్ణ, కోరుమిల్లి విజయ శేఖర్, ఇన్నమూరి రాంబాబు,మర్రి దుర్గా శ్రీనివాస్,సింహా నాగమణి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ అప్సరి, సయ్యద్ ఫయాజ్, నాయకులు ముప్పన రుద్ర,ఎల్ వి ప్రసాద్, నల్లం ఆనంద్,తలారి భగవాన్,రాయి అప్పన్న, కెవి శ్రీనివాస్,బెజవాడ వెంకటస్వామి,వానపల్లి శ్రీనివాస్,తలారి భాస్కర్,బర్ల గిరిజ కవులూరి వెంకట్రావు, కొమ్మర్తి బాబ్జి,నూకల శ్రీనివాస్, యర్రమోతు ధర్మరాజు, మిస్క జోగి నాయుడు,మోత నాగలక్ష్మి,రొక్కం సత్యనారాయణ తక్కశిల పూర్ణ, కర్రి కాశి విశ్వనాథ్, పేరూరి అంజి, వారాది నాగబాబు,అప్పలరాజు, ఆర్ ఎస్ ఆర్ బ్రదర్స్, ధర్మరాజు, మాకాని లక్ష్మణరావు,, శారద, మహబూబ్ ఖాన్, దొడ్ల బాల, కార్యకర్తలు పాల్గొన్నారు

## పల్లె పండుగతో పాడి రైతులకు అండ

★ మర్రిపాలెంలో గోకులాల శంకుస్థాపన -- గ్రామీణ ఆర్థికాభివృద్ధికి ఊతం

★ పశుపోషణను ప్రోత్సహిస్తూ రైతుల జీవన ప్రమాణాల పెంపునకు చర్యలు




**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 01:**గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులను ప్రోత్సహించి, పశుపోషణ ద్వారా రైతు కుటుంబాలకు అదనపు ఆదాయ మార్గాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లె పండుగ 3.0 -- 2026--27 కార్యక్రమం ద్వారా గోకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పోలవరం జిల్లా గంగవరం మండలం మర్రిపాలెం పంచాయతీ పరిధిలోని మర్రిపాలెం గ్రామంలో రైతుల కోసం మంజూరైన గోకులాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

మర్రిపాలెం గ్రామానికి చెందిన రైతులు కుర్రు నూకరెడ్డి, మిరియాల ఆదిలక్ష్మిలకు పల్లె పండుగ 3.0 కార్యక్రమం కింద గోకులాలు మంజూరు కావడంతో, ఆయా నిర్మాణాలకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోకులాల నిర్మాణం పూర్తయితే పశువులకు మెరుగైన వసతి కల్పించడంతో పాటు పశువుల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, పాడి ఉత్పత్తుల పెంపునకు దోహదపడుతుందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ వ్యవసాయానికి అనుబంధంగా కీలకమైన జీవనాధారంగా కొనసాగుతోందని, చిన్న, సన్నకారు రైతులకు పాడి పశువులు కుటుంబ ఆదాయానికి తోడ్పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న మౌలిక వసతుల ద్వారా రైతులు పశుపోషణను మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వీబీ గ్రామ జీఏపీఓ ప్రకాశ్, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ చెదల రమణరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ ,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బుల్లబ్బాయిరెడ్డి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు గణేష్ కృష్ణ (బలరామ కృష్ణరెడ్డి), మేట్లు సత్తిబాబు, శ్రీనివాసు, గణేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొని రైతులను అభినందించారు.

## లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేసిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 1 :**అర్హులైన వారికీ ప్రభుత్వం పారదర్శకంగా పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. గురువారం సచివాలయ ఉద్యోగులతో కలిసి విద్యుత్ కాలనీలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఆధార్ కార్డులను పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా చెక్ చేసి పింఛన్ డబ్బులు అందించారు. కేటగిరీల వారీగా లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పింఛన్ దారులతో మాట్లాడుతూ.. వారికి అందుతున్న సౌకర్యాలు, పింఛన్ ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ దారులు ప్రభుత్వం చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. అర్బన్ పరిధిలో పింఛన్ల పంపిణీ ని లబ్ధిదారులు అసౌకర్యానికి గురికాకుండా సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు నగరంలో 27,153 మంది పింఛనుదారులకు ప్రభుత్వం 11 కోట్ల 98 లక్షల 76 వేల 500 రూపాయలు విడుదల చేసిందన్నారు. పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా, శత శాతం పూర్తిచేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

### జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో గంగవరం విద్యార్థినుల ప్రతిభ

★ ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న ఏజీహెచ్ఎస్ విద్యార్థినులు





**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 01:**సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీఎంఆర్సీ రంపచోడవరం వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. పోటీల్లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని పి. నీలధరణి ప్రథమ స్థానం, 6వ తరగతి విద్యార్థిని డి. తేజస్వి లక్ష్మి సోనాక్షి ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ సత్యవతి తెలిపారు.జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థినులు తమ సృజనాత్మకతను, చిత్రలేఖన ప్రతిభను చాటుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఎన్నికలు 2026 కు సన్నద్ధం కావాలి







★ మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్,1:**మున్సిపల్ సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణకు సంబంధిత అధికారులు అన్ని విధాలా సంసిద్ధంగా ఉండాలని మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్, మున్సిపల్ పరిపాలన సంచాలకుడు పి. సంపత్‌కుమార్ ఆదేశించారు. ఇబ్బందులు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు.జేఎన్ రోడ్డులోని సూర్య గార్డెన్స్‌లో గురువారం పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'మున్సిపల్ ఎన్నికలు--2026' ఎన్నికల సంసిద్ధతపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలోని ఏడు జిల్లాలు, 25 పట్టణ స్థానిక సంస్థలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. తొలుత ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ దృశ్య మాధ్యమ సమావేశం ద్వారా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.రాజమహేంద్రవరం ప్రాంతీయ పరిధిలోని మొత్తం 34 పట్టణ స్థానిక సంస్థల్లో న్యాయస్థాన కేసుల పరిధిలో ఉన్న తొమ్మిదింటిని మినహాయించి, మిగిలిన 25 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు చర్యలు ముమ్మరం చేసినట్లు సురేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు.వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాలో న్యాయపరమైన అంశాలు కొలిక్కి వచ్చాయని పేర్కొన్నారు. చట్టం--5, పరిసర గ్రామాల విలీనం, వార్డుల విభజన వివాదాలు, న్యాయస్థాన కేసుల కారణంగా ఎన్నికలు నిలిచిపోయిన పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఎన్నికలు నిర్వహించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, జరిగేలా సమస్యాత్మక, ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, విద్యుత్, వెలుతురు తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి అధికారులకు సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

సీడీఎంఏ పి. సంపత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పొరపాట్లు, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని సూచించారు. ఈసారి మేయర్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరుగుతుందన్నారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను నిబంధనల మేరకు సిద్ధం చేసి ప్రదర్శించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల రిజర్వేషన్ల వివరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రిజర్వేషన్ల లో ప్రభుత్వ నిబంధనలు, ఎన్నికల నియమాలను అనుసరించాలన్నారు.

ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా, తటస్థంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఎన్నికల నిబంధనల ను పాటించాలన్నారు. విజయవాడ నగరపాలక కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి ప్రాంతాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల అనుకూలత అంశాలను ముందుగానే క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రాజమహేంద్రవరం నగరపాలక కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం అదనపు సంచాలకుడు ఎస్. రవీంద్రబాబు దృశ్య ప్రదర్శన ద్వారా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, నోటిఫికేషన్ అనంతరం అనుసరించాల్సిన విధివిధానాలు, ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సిబ్బంది విధులు, పోలింగ్ నిర్వహణ, ఎన్నికల సామగ్రి నిర్వహణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్ర మంలో ప్రాంతీయ సంచాలకుడు సీహెచ్ నాగ నరసింహారావు, ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఏ. భానుప్రతాప్, మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, అదనపు కమిషనర్ (ఆర్ఎంసీ) పి.వి. రామలింగేశ్వర్, ఉప కమిషనర్ ఎస్. వెంకటరమణ, కార్యదర్శి శైలజవల్లి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ సుజల పథకానికి వెల్లి విరిసిన"గద్దె" దాతృత్వం



**స్వగ్రామంలో స్వచ్ఛత తాగునీరుకు ముందుకొస్తున్న "గద్దె" సోదరులు**

**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్: 01:**గ్రామీణ ప్రజలకు స్వచ్ఛతమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాం లోనే ప్రవేశపెట్టిన "ఎన్టీఆర్ సుజల పథకాలు" గత వైయస్సార్సీపి ప్రభుత్వంలో నిరుపయోగంగా మార్చడం అనేక గ్రామాలు ఇప్పటికీ స్వచ్ఛత నీరు పొందలేకపోతున్నాయని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సీతానగరం మండలంలోని వంగలపూడిలో వివిధ కార్యక్రమాల్లో రాజానగరం టిడిపి ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి ఎమ్మెల్యే బలరామకృష్ణ గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా తాగునీటి వనరులపై గ్రామస్తులు వీరికి పలు సమస్యలను విన్నవించారు. గ్రామంలో ఉన్న పథకాన్ని వీరు పరిశీలించారు. వంగలపూడిలో ఎన్టీఆర్ సుజల పథకం ఏర్పాటు చేసే సమయంలో గ్రామానికి చెందిన దేవి సీ ఫుడ్స్ డైరెక్టర్ గద్దె సాంబశివరావు సుమారు రూ.4 లక్షలు విరాళంగా ఇవ్వడంతో ఎన్నో ఏళ్ళు పథకం నడిచిందని గ్రామస్తులు ఎమ్మెల్యే బత్తులకు, ఇన్చార్జి బొడ్డుకు వివరించారు. ప్రస్తుతం పథకం మరమ్మత్తులకు అవసరమైన నిధులు కోసం చూస్తున్నామని అధికారులు వివరించారు. రూ.2 లక్షల విరాళంగా ప్రకటించిన "గద్దె" నల్లి. ఎన్టీఆర్ సుజల పథకం మరమ్మత్తులు పూర్తి చేయించడానికి వంగలపూడి కి చెందిన గద్దె సాంబశివరావు సోదరుడు తెలుగుదేశం పార్టీ నాయకుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి) ముందుకొచ్చారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై అక్కడికక్కడే పరిష్కరించేలా గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి) చొరవ చూపడం అభినందనీయమని రాజానగరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ సమస్యలపై కూటమి శ్రేణులు దృష్టి పెట్టి పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. ఎన్టీఆర్ సుజల పథకాలు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేలా తెలుగుదేశం పార్టీ నాయకుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి మాదిరిగా మరింత మంది ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ సాయంతో పాటు దాతలు దాతృత్వం వల్ల మెరుగైన ఫలితాలు సాధించుకోవచ్చునని ఎమ్మెల్యే సతీమణి జనసేన పార్టీ నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గద్దె వెంకటకృష్ణ చౌదరిని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గద్దె శీను, మద్దిపాటి సుజీరాజు, నీరుకొండ శివ, కాజా బుల్లబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

## జీవో నంబర్ 3కు ప్రత్యామ్నాయ చట్టం వెంటనే తీసుకురావాలి

**ఐటీడీఏ పాఠశాల ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలి**

**తక్షణమే ఐటీడీఏ ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి: ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కుంజా శ్రీను**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 01:**ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జీవో నంబర్ 3కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక చట్టాన్ని వెంటనే తీసుకురావాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీ నిరుద్యోగులు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు గురువారం ఆయన మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా కుంజా శ్రీను మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జీవో నంబర్ 3కు ప్రత్యామ్నాయంగా చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తరువాత ఆదివాసీ సమస్యలపై స్పష్టమైన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు చర్చలు, సమీక్షల పేరుతో కాలయాపన చేయకుండా ప్రత్యామ్నాయ చట్టం ఎప్పుడు తీసుకువస్తారో స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఉద్యోగాలను వంద శాతం స్థానిక ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ఆయన కోరారు. 2025 డీఎస్సీలో రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని 3,000కు పైగా ఉద్యోగాలు నాన్-ట్రైబల్ అభ్యర్థులకు దక్కడం వల్ల ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక నియామక విధానం లేకపోతే స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు.ఐటీడీఏ వ్యవస్థ ఏర్పాటులో ప్రధాన ఉద్దేశం ఆదివాసీల రక్షణ, అభివృద్ధి, సంక్షేమమేనని పేర్కొన్న ఆయన, ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగాలను కూడా నాన్-ట్రైబల్స్‌కు కేటాయిస్తే స్థానిక ఆదివాసీ యువతకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయని అన్నారు. ఐటీడీఏలకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి, స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని కుంజా శ్రీను విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోపు జీవో నంబర్ 3కు ప్రత్యామ్నాయ ప్రత్యేక చట్టాన్ని ప్రకటించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ నిరుద్యోగ యువత తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కోటం రాజన్నదొర, సరె వెంకటేశ్వర్లు, ఆదివాసీ నిరుద్యోగ సంఘాల ప్రతినిధులు సిరిమల్లె రెడ్డి, క్రాంతికుమార్, సత్యనారాయణ, ప్రేమ్ శేఖర్, దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరాలి



ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం కేటాయింపులు.. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంలో డీడీ (టీడబ్ల్యూ) ఎం. రుక్మందయ్య

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 01:**పోలవరం జిల్లా ఉపాధ్యాయుల సంఘాల సమన్వయ సమావేశం రంపచోడవరంలోని పీఎంఆర్సీలో డీడీ (టీడబ్ల్యూ) ఎం. రుక్మందయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో ఉపాధ్యాయుల కేటాయింపులు, విధుల్లో చేరిక, ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అమలుకు సంబంధించిన అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా డీడీ (టీడబ్ల్యూ) ఎం. రుక్మందయ్య మాట్లాడుతూ ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం ఆయా జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో తప్పనిసరిగా చేరి విధులు నిర్వర్తించాలని సూచించారు. ఉపాధ్యాయుల కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఉపాధ్యాయులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను, సంబంధిత అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ఉపాధ్యాయుల విధుల నిర్వహణ, పాఠశాలల్లో బోధనకు సంబంధించిన అంశాలపై సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్టీయూ తరఫున జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి వేణుగోపాల్, బొడారపు కృష్ణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి కారం సూరిబాబు, దూడ మహేష్, టీడబ్ల్యూఏటీఏ, టీఎన్యూఎస్, ఏపీటీడబ్ల్యూఏ నాయకులు లండ వెంకటేష్, హెచ్ఎంల సంఘం నాయకులు కరుణ విలాస్, పీఎంఆర్సీ అధికారులు, సూపరింటెండెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## గోకవరంలో నేడు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా పల్లె పండుగ 3.0 అభివృద్ధి జాతర



**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 01:–** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మరియు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ల చేతుల మీదుగా ప్రారంభమైన పల్లె పండుగ 3.0 కార్యక్రమం లో భాగంగా నేడు అనగా శుక్రవారం గోకవరం మండలం లో అభివృద్ధి జాతర ఘనంగా శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జ్యోతుల నెహ్రూ చేతులు మీదుగా నిర్వహించనున్నారని ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 3:00 గంటలకు కొత్తపల్లి గ్రామం లో పలు శంకుస్థాపనలు, మధ్యాహ్నం 4:00 గంటలకు కామరాజుపేట, జన్నాధపురం, శివరామ పట్నం గ్రామాలలోనూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ భూమి పూజ చేస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఈ అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.

## ప్రతి పేదవాడి అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన



### ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తెదేపా ఇన్చార్జి బొడ్డు

**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ :01:** రాజానగరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ , రాజానగరం టిడిపి ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి స్పష్టం చేశారు. సీతానగరం మండలంలోని రూ. 8.94 కోట్లతో సీతానగరం రహదారులకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మశాన వాటికకు వెళ్లే రహదారి సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలంలో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించినట్లు తెలిపారు. రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ప్రతి కిలోమీటర్ రోడ్డుకు అభివృద్ధి చేసేలా కార్యచరణ ప్రణాళికను రూపొందించామన్నారు. సీతానగరం మండలంలో కాటవరం, జాలిమూడి బొబ్బిలంక ఇనగంటివారి పేట ,రఘదేవపురం వంగలపూడి, చిన్న కొండేపూడి, పురుషోత్తపట్నం రామచంద్రపురం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టిడిపి ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి రహదారులకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, జనసేన మహిళా నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, మట్ట వెంకటేశ్వరరావు, మట్ట కాపు, తెలుగు దేశం నాయకులు వలవల రాజా, గద్దె వెంకటకృష్ణ చౌదరి, గద్దె శ్రీను, నీరుకొండ శివ, కాండ్రు శ్రీనివాసరావు, పెందుర్తి రాజా, బిక్కిన సతీష్, కాండ్రు శేఖర్, ఆశన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను సమగ్రంగా అమలు చెయ్యాలి..
## సీఐటీయూ అనుబంధ యూనియన్ డిమాండ్....



**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 01;** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులందరికీ పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరేలా, పాత సంక్షేమ పథకాలన్నింటినీ వెంటనే పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిములను వెంటనే విడుదల చేయాలని కాకినాడ జిల్లా భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (సీఐటీయూ అనుబంధం, రి.నెం: హెచ్ 69) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం అడ్డతీగల తహశీల్దార్ ద్వారా రాష్ట్ర లేబర్ కమిషనర్‌కు సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. సుదీర్ఘ పోరాటాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును పునఃప్రారంభించినప్పటికీ, అరకొర ప్రయోజనాలు మాత్రమే కల్పిస్తూ అత్యధిక మంది కార్మికులను సంక్షేమానికి దూరం చేస్తోందని యూనియన్ నేతలు విమర్శించారు. గత ఐదేళ్లుగా వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎలాంటి పథకాలు అమలు కాకపోవడంతో అత్యధిక శాతం మంది సభ్యత్వ రెన్యూవల్ చేసుకోలేకపోయారని, కొత్త నమోదులు కూడా నిలిచిపోయాయని నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రెన్యూవల్స్‌కు అవకాశం కల్పించినప్పటికీ, కేవలం ఆన్‌లైన్ విధానాన్ని మాత్రమే తప్పనిసరి చేయడం వల్ల గ్రామీణ, నిరక్షరాస్య కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్ వినియోగం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లోపించిన నేపథ్యంలో ఆన్‌లైన్‌తో పాటు సమాంతరంగా ఆఫ్‌లైన్ విధానాన్ని కూడా అందుబాటులోకి తెచ్చి దరఖాస్తులను స్వీకరించాలని స్పష్టం చేశారు.

అసెంబ్లీ సాక్షిగా వెల్ఫేర్ బోర్డులో రూ. 4,500 కోట్లకు పైగా నిధులు ఉన్నట్లు ప్రభుత్వమే వెల్లడించినా, క్షేత్రస్థాయిలో కార్మికులకు నయాపైసా ఉపయోగపడకపోవడం శోచనీయమని నేతలు ధ్వజమెత్తారు. నిర్మాణ రంగంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఎందరో కార్మికులు ప్రాణాలు కోల్పోవడమో, శాశ్వత అంగవైకల్యానికి గురికావడమో జరుగుతోందని గుర్తుచేశారు. పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రమాద బీమాను కనీసం రూ. 10 లక్షలకు పెంచాలని భారీ ర్యాలీ నిర్వహించారు.

## తెలుగుదేశం నాయకుడు వాసిరెడ్డి బాబీ పై ఎస్సీ ఎస్టీ ఆట్రాసిటీ కేసు నమోదు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబరు 1:**స్థానిక ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అపార్ట్మెంట్లో వాచ్మెన్ గా పనిచేస్తున్న దళిత వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన తెలుగుదేశం నాయకుడు వాసిరెడ్డి బాబి, అనుచరులతో కలిసి భౌతిక దాడి చేసి, కులం పేరుతో తిట్టడం తో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయింది. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ బాజీలాల్ తెలిపారు. పదో వార్డు మోడల్ కాలనీలో పల్లవి అపార్ట్మెంట్లో 401 ఫ్లాట్లో మాజీ మంత్రి , మాజీ మంత్రి చేగొండి హరి రామ జోగయ్య కుమారుడు చేగొండి వెంకట రామదాసు కుటుంబం నివసిస్తుంది. ఫ్లాట్ నుంచి కిందకు వచ్చి పూలు కోస్తున్న రామదాసు భార్యను వాచ్మెన్ చెరుకుచెర్ల అప్పారావు కోయద్దని వారించాడు. దాంతో ఆగ్రహం చెందిన ఆమె భర్త రామదాసు వాచ్మెన్ అప్పారావు పై దాడి చేసి కులం పేరుతో తిట్టడం జరిగింది. ఇదే అపార్ట్మెంట్లో నివాసముంటున్న తెలుగుదేశం పార్టీ వాసిరెడ్డి బాబి సోదరి ఆయనకి జరిగిన సంగతిని చెప్పింది. దాంతో వాసిరెడ్డి బాబి , జగదీష్ లు అనుచరులతో వచ్చి రామదాసు ను కొట్టడం జరిగింది. ఈ రెండు సంఘటనలపై స్థానిక ప్రకాష నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు అందడంతో పరస్పర కేసులు నమోదు చేశామని సి ఐ బాజీ లాలు తెలిపారు. ఈ రెండు సంఘటనల్లో వారి అనుచరులను కులం పేరుతో తిట్టినట్లు రామదాసు, వాసిరెడ్డి బాబీ లపై ఫిర్యాదులు రావడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశామని సి ఐ తెలిపారు. ఇదిలా ఉండగా, గత నెలలో నగరంలో జరిగిన రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ప్రసాద్ ఆదిత్య మాల్ లో మెడికో ప్రియాంక హిట్ అండ్ రన్ కేసులో వాసిరెడ్డి బాబి నిందితులను స్థానిక ప్రజా ప్రతినిధుల అండతో సెటిల్మెంట్ చేశారని , నగరంలో వాసిరెడ్డి బాబి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని నగర ప్రతిపక్ష వైసిపి పార్టీ శ్రేణులు తీవ్ర ఆరోపణలు చేస్తున్న సంగతి విధితమే.

## వేటమామిడిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ... ఐ వి ఆర్ ఎస్ కాల్స్‌పై లబ్ధిదారులకు సూచనలు..



**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 01;** మండలంలోని వేటమామిడి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఎన్.టీ.ఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీవీ కుమార్ పాల్గొని లబ్ధిదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పింఛను పంపిణీ ప్రక్రియలో పారదర్శకత, అవినీతి రహిత సేవలు, లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛను అందించడం, పంపిణీ అధికారుల ప్రవర్తన వంటి అంశాలపై పింఛనుదారులకు వివరించారు. అమరావతి నుంచి పింఛనుదారులకు వచ్చే ఐ వి ఆర్ ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) కాల్స్‌కు ప్రతి ఒక్కరూ సరైన సమాచారంతో స్పందించాలని ఎంపీడీవో సూచించారు. ప్రతి నెలా 1వ తేదీన ఇంటి వద్దే పింఛను అందుతున్నదా, పింఛను పంపిణీ సమయంలో ఎలాంటి లంచం లేదా అవినీతి చోటుచేసుకున్నదా, పింఛను పంపిణీ అధికారి ప్రవర్తన ఎలా ఉందనే అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉందని తెలిపారు. ఇంటి వద్దే పింఛను అందితే, అవినీతి జరగకపోతే, అధికారి ప్రవర్తన బాగుంటే ఐ విఆర్ఎస్ లో సంబంధిత ప్రశ్నలకు సూచించిన విధంగా స్పందించాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. మండలంలోని పింఛను పంపిణీ అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు కూడా ప్రతి లబ్ధిదారునికి ఈ అంశాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవినీతికి తావులేకుండా, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇంటి వద్దే సకాలంలో పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పింఛను పంపిణీ అధికారులు లబ్ధిదారులతో మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అడ్డతీగల మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కొనసాగుతోందని, మండలంలో మొత్తం 5,114 పింఛన్లు ఉండగా 90.2 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఏవీవీ కుమార్ తెలిపారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేసేందుకు, అధికారులు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో కుమార్ తెలిపారు.

## వాక్పృత్వ పోటీల్లో ప్రతిభ సాటిన గోకవరం శ్రీవిద్య స్కూల్ విద్యార్థి భూమిజా సింధు




**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 01:–** వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయిలో నిర్వహించిన వాక్పృత్వ పోటీల్లో గోకవరం శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కి చెందిన విద్యార్థిని ఎస్ . భూమిజ సింధు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికనట్టు పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన సింధూజ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిందాన్నారు. ఈ కార్యక్రమం జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు గారి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఎస్ కే వి టి స్కూల్ నందు నిర్వహించడం జరిగిందని ఆమె పట్టుదల,ఆత్మవిశ్వాసం, కృషి ప్రతిభకు ఇది గొప్ప నిదర్శనమన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా విజయాన్ని సాధించి శ్రీ విద్యా పాఠశాల కీర్తిని మరింత ఇనుమడింప జేయాలని అకాక్షించారు. శ్రీ విద్యా స్కూల్ ప్రతిభను గుర్తించి గోకవరం మండలంలోని వివిధ ప్రముఖులు పలు ఉద్యోగ సంఘాల వారు విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు శ్రీ విద్యా పాఠశాల యాజమాన్యం మరియు అధ్యాపక అధ్యాపకైతర సిబ్బంది పలువురు భూమిజ సింధు ని అభినందించారు.

## తెల్లవారకుండగానే ఇంటింటికి పెన్షన్లు పంపిణీ..



**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 01:–** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఈమధ్య బ్యాంకుల సమ్మె కారణంగా ప్రజల్లో ఉన్న చిన్న అపోహను తొలగిస్తూ ప్రభుత్వం తెల్లవారగానే పెన్షన్ పంపిణీ కి శ్రీకారం చుట్టింది దీనిలో భాగంగా గోకవరం మండలంలోని 14 పంచాయతీ లలో ఉదయం 5 గంటల నుండి పెన్షన్ పంపిణీ ప్రారంభమైంది వివిధ నాయకులు సచివాలయ సిబ్బంది డ్వాక్రా వి వో ఏలు తమ తమకు కేటాయించిన ప్రాంతాలలో పెన్షన్ పంపిణీలో నిమగ్నమై 10:00 కల్లా పూర్తి చేసి అవ్వ తాతలకు పెన్షన్ సొమ్ములు పూర్తి స్థాయిలో అందజేశారు. దీనితో మూడు రోజులు బ్యాంకర్ల సమ్మె కారణంగా అందుతాయా లేదా అనే అపోలో ఉన్న వివిధ సామాజిక పెన్షన్ తీసుకునే వారి అందరికీ మొహాలలో ఆనందాలు వ్యక్తం అయ్యాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01:**పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం కస్పా పెంటపాడు గ్రామంలోని శ్రీ బైరాగి మఠంలో కొలువైన శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన వడ్డి రఘురామ్ నాయుడుకి ఆలయ ఈవో చంద్రశేఖర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవంలో వడ్డి రఘురామ్ నాయుడు పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులతో కలిసి వడ్డి రఘురామ్ నాయుడు ఆలయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనికార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులకు ప్రవేశాలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబరు 1:** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడి ప్రాంగణాల్లో 2026--27 విద్యా సంవత్సరానికి కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ మునుగు శ్రీనివాసరావు తెలిపారు. రాజమహేంద్రవరం సాహిత్య పీఠంలో ఎం.ఏ. తెలుగు, జ్యోతిష్యంలో సర్టిఫికెట్, డిప్లొమా, యోగా డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు; శ్రీశైలం చరిత్ర, సంస్కృతి--పురావస్తు శాస్త్ర పీఠంలో ఎం.ఏ. చరిత్ర--పురావస్తు శాస్త్రం; కూచిపూడి శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠంలో ఎం.పి.ఏ. కూచిపూడి నృత్యం, సర్టిఫికెట్, డిప్లొమా, సాత్వికాభినయం, యక్షగానం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు అక్టోబరు 17, 2026లోగా సంబంధిత పీఠాధిపతి/ప్రిన్సిపాల్‌కు పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయాలని రిజిస్ట్రార్ సూచించారు. రూ.300 ఆలస్య రుసుముతో అక్టోబరు 22లోగా కన్వీనర్, కేంద్ర ప్రవేశాల కమిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు, రాజమహేంద్రవరం--533124 చిరునామాకు దరఖాస్తులు పంపవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో కూడా పూర్తి చేయాలని, కోర్సు ఫీజులను ఆన్‌లైన్‌లో క్యూ.ఆర్. కోడ్ ద్వారా చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో, ఇతర సమాచారం కోసం 9492692389, 80032947005 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆయా కోర్సులకు నిర్దేశించిన విద్యార్హతలు, పూర్వ కోర్సుల ఉత్తీర్ణత తదితర అర్హతలను అభ్యర్థులు కలిగి ఉండాలని తెలిపారు. కోర్సుల వ్యవధి, సీట్లు, ఫీజులు, ప్రవేశ అర్హతలు తదితర పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని ఆయన సూచించారు.ఫోన్ నెంబర్ 0883 2947005 సంప్రదించ గలరుద

## పెన్షన్ల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్.** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలోని 7వ వార్డు షాదీఖానా వద్ద ఈరోజు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం శాసనసభ్యులు శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి భవాని బాబు , రెవెన్యూ ఆఫీసర్ పి ప్రసాద్ రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి సీతారాం, సానిటేషన్ సూపర్వైజర్ సోమేశ్వరరావు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ హరీష్ , మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శశి ఇంజినీరింగ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం 190 మంది విద్యార్థుల స్వచ్ఛంద రక్తదానం.






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01:**తాడేపల్లిగూడెంలోని శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్, పశ్చిమ గోదావరి ఆధ్వర్యంలో సేవా పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వసుంధర బ్లడ్ సెంటర్ సంయుక్త సహకారంతో, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్--ఏలూరు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 190 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలో రక్తదాతల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో శశి విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని పేర్కొంటూ రక్తదాతలను అభినందించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించడం ఎంతో అవసరమన్నారు.మై భారత్ కోఆర్డినేటర్ ప్రేమ్ సింగ్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ సూర్య, లయన్స్ క్లబ్ ఏలూరు అధ్యక్షులు శ్రీ హరి, సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.సేవా పక్వాడలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి, అతిథులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ సల్మాన్ భాష, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## డిబేట్లో రెండో స్థానం సాధించిన నందిని



**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 1 :** జిల్లాస్థాయి డిబేట్ పోటీలలో మండలంలో దాలిపాడు ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కారం నందిని ద్వితీయ స్థానం సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా సేవతో దేశ నిర్మాణం పై జిల్లా స్థాయి రంప చోడవరంలో జరిగిన డిబేట్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించిందని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని జిల్లా స్థాయిలో డిబేట్లో ద్వితీయ స్థానం సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## తాడేపల్లిగూడెంలో బియస్ యన్ యల్ ఉద్యోగుల ద్విచక్రవాహన ర్యాలీ.







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01** బియస్ యన్ యల్ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆ సంస్థ ఉద్యోగులు తాడేపల్లిగూడెం పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. వినియోగదారులకు బియస్ యన్ యల్ అందించే వివిధ ఆధునిక సేవల వివరాలను తెలిపే ప్లకార్డులను ఈసందర్భంగా ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ కెవిఏపి సుబ్బారావు, సబ్ డివిజనల్ ఇంజనీర్లు, ప్రసాద్, ప్రతాప్ కుమార్, జెటిఓలు మధుబాబు, సూర్రెడ్డి, పట్నాయక్, శంకర్ నాయక్,సుజాత, ఇతర ఉద్యోగులు మరియు టిప్ భాగస్వాములు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయం కళ్యాణ మండపం ఘనంగా ప్రారంభోత్సవం.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01:**కె. పెంటపాడు గ్రామంలోని బైరాగి మఠం వద్ద శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముందుగా శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం కళ్యాణ మండపం వద్ద రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ ప్రజలకు, భక్తులకు మరియు శుభకార్యాల నిర్వహణకు ఉపయోగకరంగా ఉండేలా కళ్యాణ మండపం అందుబాటులోకి రావడం పట్ల ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న మద్యం మరియు మాంసం దుకాణాలు మూసివేత



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01:**గాంధీ జయంతి సందర్భంగా రేపు 02-10-2026 శుక్రవారం తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, మాంసం మరియు చేపల దుకాణాలు పూర్తిగా మూసివేయాలని, రెస్టారెంట్, హోటళ్ల లో కూడా మాంసం విక్రయించకూడదని కమిషనర్ యేసుబాబు ఆదేశించారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నిషేధం అమలు చేయబడుతుంది. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి.ప్రజలు మరియు వ్యాపారులు సహకరించాలని కోరడమైనది.

## ఆర్డీవో కె. స్వాతికి ఘన వీడ్కోలు



**ఐదు నెలల సేవలు ప్రశంసనీయం.. ప్రజలకు అంకితభావంతో సేవలందించారు**

**నూతన సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కు అధికారుల స్వాగతం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:**బదిలీపై వెళ్తున్న రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కె. స్వాతికి అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం సాయంత్రం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పాటైన నేపథ్యంలో రంపచోడవరం డివిజన్‌కు ఆర్డీవో సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు సర్వసాధారణమని, ఇటీవల ఆర్డీవోగా పనిచేసిన కె. స్వాతి ప్రత్యేకత కలిగిన అధికారిగా సేవలందించారని కొనియాడారు. విధుల్లో ఎదురయ్యే సమస్యలను చూసి నిరుత్సాహపడకుండా ధైర్యంగా, సమర్థవంతంగా ఎదుర్కోవడం ముఖ్యమన్నారు.

వివిధ అధికారిక పర్యటనలు, కార్యక్రమాల్లో ఆమె అంకితభావంతో పనిచేశారని తెలిపారు. 24 గంటలూ అందుబాటులో ఉండే విధుల్లో భాగంగా తన పరిధిలోని ప్రజలకు సేవలందిస్తూ అన్ని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. విధుల పట్ల ఆమె చూపిన అంకితభావం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

నూతన రంపచోడవరం సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ సూచనలు, సలహాలను పాటిస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఆర్డీవో కె. స్వాతి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.



### సహకారం మరువలేను

బదిలీపై వెళ్తున్న ఆర్డీవో కె. స్వాతి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో రంపచోడవరం ప్రాంత ప్రజలకు సేవ చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఐదు నెలల పాటు ఆర్డీవోగా విధులు నిర్వహించిన సమయంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, నూతన సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్‌లు ఆర్డీవో కె. స్వాతిని గజమాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అదే సందర్భంగా నూతన సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్‌కు అధికారులు స్వాగతం పలికారు.కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, సీపీఓ వెంకట్రావు, ఏపీవో జనరల్ డీఎన్వీ రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీమిండియాకు ఎదురుదెబ్బ.. మూడో వన్డేకు ప్రసిద్ధ్ కృష్ణ దూరం.. యువ పేసర్ కు చాన్స్!

- వెస్టిండీస్‌తో రెండో వన్డేలో తొడ కండరాల గాయంతో మైదానం వీడిన ప్రసిద్ధ్
- అతని స్థానంలో యువ పేసర్ అన్షుల్ కంబోజ్‌కు జట్టులో చోటు
- పరీక్షల కోసం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్‌కు వెళ్లనున్న ప్రసిద్ధ్
- న్యూజిలాండ్ పర్యటనకు ప్రసిద్ధ్ లభ్యతపై నెలకొన్న ఆందోళన



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఉన్న భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. కీలక పేస్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ తొడ కండరాల గాయం (హ్యామ్‌స్ట్రింగ్) కారణంగా మూడో వన్డేకు దూరమయ్యాడు. అతని స్థానంలో యువ పేసర్ అన్షుల్ కంబోజ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. గువహటి వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. బౌలింగ్ చేస్తున్న సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ అసౌకర్యంగా కనిపించాడు. తన తొలి స్పెల్‌లో నాలుగు ఓవర్లు వేసిన అతను, 31వ ఓవర్ వేసిన తర్వాత మైదానం వీడాడు. మొత్తం మీద కేవలం ఐదు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయడంతో, అతని స్థానంలో జట్టు యాజమాన్యం పార్ట్ టైమ్ బౌలర్ నమన్ ధిర్‌తో బౌలింగ్ చేయించాల్సి వచ్చింది. గాయం తీవ్రతను అంచనా వేసేందుకు ప్రసిద్ధ్ కృష్ణను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పంపనున్నారు. అక్కడ జరిపే స్కాన్‌ల ఆధారంగా అతను కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందనే దానిపై స్పష్టత రానుంది. "ప్రసిద్ధ్ మూడో వన్డే ఆడటం లేదు. తదుపరి పరీక్షల కోసం అతను బెంగళూరు వెళతాడు. ప్రస్తుతానికి అతని స్థానంలో కంబోజ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది" అని బీసీసీఐ వర్గాలు గురువారం ఓ వార్తా సంస్థకు తెలిపాయి. అన్షుల్ కంబోజ్‌ను, ప్రస్తుతం పుదుచ్చేరిలో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో జరుగుతున్న మ్యాచ్ నుంచి బీసీసీఐ వెనక్కి పిలిపించింది. ఆ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు తీసిన కంబోజ్, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం రెండు ఓవర్లు వేసిన అనంతరం, అతడికి తాజా సమాచారం అందించారు. దాంతో అతడు భారత జట్టుతో చేరేందుకు బయలుదేరాడు.

ప్రసిద్ధ్ గాయం కేవలం ఈ సిరీస్‌కే కాకుండా, త్వరలో జరగనున్న న్యూజిలాండ్ పర్యటనపైనా ఆందోళన కలిగిస్తోంది. ఆ పర్యటనలో ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఉన్న నేపథ్యంలో ప్రసిద్ధ్ వంటి కీలక బౌలర్ లభ్యత జట్టుకు చాలా ముఖ్యం. మూడో వన్డేలో ప్రసిద్ధ్ లేకపోవడంతో, ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లలో బెంచ్‌కే పరిమితమైన సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు లేదా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది.

# వన్డే క్రికెట్‌లో కొత్త చరిత్ర.. ప్రపంచ రికార్డు బద్దలుకొట్టిన టీమిండియా!

- వెస్టిండీస్‌తో రెండో వన్డేలో భారత్‌కు చారిత్రక విజయం
- వన్డేల్లో టీమిండియాకు ఇదే అత్యధిక స్కోరు ఛేజింగ్
- కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అజేయ డబుల్ సెంచరీ
- అతివేగంగా 300 పరుగులు చేసిన జట్టుగా ప్రపంచ రికార్డు
- దక్షిణాఫ్రికా 18 ఏళ్ల రికార్డును బద్దలుకొట్టిన భారత్



**హైదరాబాద్ పెన్ పవర్:** శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా వన్డే క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. వెస్టిండీస్‌తో గువాహటి వేదికగా నిన్న జరిగిన రెండో వన్డేలో 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి అద్భుత విజయాన్ని అందుకుంది. వన్డే ఫార్మాట్‌లో భారత్‌కు ఇదే అతిపెద్ద విజయవంతమైన ఛేజింగ్ కావడం విశేషం. ఈ భారీ ఛేదనలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ముందుండి నడిపించాడు. కేవలం 133 బంతుల్లోనే అజేయంగా 223 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. గిల్ వీరోచిత ఇన్నింగ్స్‌తో టీమిండియా 43.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేసింది.

**భారత్ మరో ప్రపంచ రికార్డు**

ఈ మ్యాచ్‌లో భారత్ మరో ప్రపంచ రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. వన్డేల్లో అత్యంత వేగంగా 300 పరుగుల మార్కును అందుకున్న జట్టుగా నిలిచింది. కేవలం 175 బంతుల్లోనే (30 ఓవర్లలోపు) టీమిండియా ఈ ఘనతను సాధించింది. ఇంతకుముందు ఈ రికార్డు దక్షిణాఫ్రికా పేరిట ఉండేది. 2006లో జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియాపై ఆ జట్టు 194 బంతుల్లో 300 పరుగులు చేసింది. తాజాగా ఆ రికార్డును భారత జట్టు బద్దలుకొట్టింది.

# ఇషాన్ కిషన్ ఎమోషనల్.. భారత్ తరఫున ఆడటం వేరే ఫీలింగ్!

- పతకం కోసం ఆడటం ప్రత్యేకమన్న ఇషాన్
- శ్రీలంకపై 80 పరుగులతో మెరిసిన కిషన్
- 45 పరుగులకే శ్రీలంక ఆలౌట్
- జట్టు అవసరాలే ముఖ్యమన్న ఇషాన్
- శనివారం పాకిస్థాన్‌తో స్వర్ణ పోరు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల్లో భారత్ తరఫున ఆడటం.. అందులోనూ పతకం కోసం పోరాడటం చాలా ప్రత్యేకమైన అనుభూతినిస్తుందని వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అన్నాడు. సాధారణ అంతర్జాతీయ మ్యాచ్‌లతో పోలిస్తే ఆసియా క్రీడల్లో కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో ఇషాన్ కిషన్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 80 పరుగులతో రాణించి భారత్ 169 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం భారత బౌలర్లు శ్రీలంకను కేవలం 45 పరుగులకే ఆలౌట్ చేయడంతో భారత్ ఘన విజయం సాధించింది. "భారత్ కోసం ఆడుతున్నప్పుడు.. ముఖ్యంగా పతకం కోసం ఆడుతున్నప్పుడు మనసులో ఏదో ప్రత్యేకమైన భావన ఉంటుంది. ఇక్కడ బీసీసీఐ కోసం కాదు.. మొత్తం దేశం కోసం ఆడుతున్నామనే ఫీలింగ్ వస్తుంది. చుట్టూ భారత జెండాలు కనిపించడం, అభిమానులు పెద్ద సంఖ్యలో మద్దతు ఇవ్వడం ఆ అనుభూతిని మరింత పెంచుతుంది. బయటకు చూపించకపోయినా లోపల మాత్రం కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుంది" అని ఇషాన్ చెప్పాడు. పగుళ్లు కనిపించే పిచ్‌పై బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదని ఇషాన్ తెలిపాడు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం 150 పరుగులు చేస్తే సురక్షితంగా ఉంటామని ముందే అంచనా వేసినట్లు చెప్పాడు. ఒక బ్యాటర్ క్రీజులో కుదురుకుంటే చివరి వరకు ఉండి భారీ స్కోరు చేయాలన్నది జట్టు ప్రణాళికగా ఉందని వివరించాడు. "ఇలాంటి పిచ్‌లపై వ్యక్తిగత లక్ష్యాల కంటే జట్టు అవసరాలే ముఖ్యం. పరిస్థితిని గమనిస్తూ చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టాలి" అని పేర్కొన్నాడు. ఇక శనివారం పాకిస్థాన్‌తో జరగనున్న స్వర్ణ పతక పోరుపై కూడా ఇషాన్ స్పందించాడు. మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండాలని, ఆ క్షణాలను ఆస్వాదిస్తూ ఆడాలని జట్టు భావిస్తోందన్నాడు.

జపాన్‌లో లభించిన ఆతిథ్యంపై ఇషాన్ ప్రశంసలు కురిపించాడు. భాష సమస్య ఉన్నప్పటికీ స్థానికులు ఎంతో సహాయం చేశారని చెప్పాడు. భారత అభిమానులు ఎక్కడికి వెళ్లినా మద్దతుగా నిలుస్తున్నారన్నారు. గెలిచినా ఓడినా తమకు అండగా ఉంటున్న అభిమానులకు ఎప్పటికీ కృతజ్ఞతలు చెబుతామని అన్నాడు.




# విరహంలో నవనీతం.. అదొక్కటే తపన!



సోషల్ మీడియా సంచలనం, ప్రముఖ నటి అవ్‌నీత్ కౌర్ మరోసారి తన అద్భుతమైన ఫ్యాషన్ లుక్‌తో అభిమానులను కట్టిపడేశారు. ప్రస్తుతం లండన్‌లో ఉన్న ఈ బ్యూటీ తన స్టైలిష్ అప్పియరెన్స్‌తో గ్లోబల్ లెవెల్‌లో ట్రెండ్ సెట్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌ను పరిచయం చేస్తూ యువతను ఆకట్టుకునే అవ్‌నీత్ తాజాగా షేర్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.

-రెడ్ కార్పెట్ రెడీ- అనే క్యాప్షన్‌తో నవ్‌నీత్ పోస్ట్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రసిద్ధ ఫోటోగ్రాఫర్ రోహిత్ యూకే కెమెరాలో బంధించిన ఈ ఫొటోల్లో యంగ్ బ్యూటీ ఎంతో గ్లామరస్‌గా కనిపిస్తున్నారు. అద్భుతమైన డిజైన్ కలిగిన ఎర్రటి గౌన్‌లో రాజసంలా మెరుస్తూ.. అందరి దృష్టిని తన వైపునకు తిప్పుకున్నారు. ఈ పోస్ట్ చూసిన అభిమానులు, ఫాలోవర్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఆమెను -లాల్ పారీ-, -రెడ్ వెల్వెట్ గర్ల్- అంటూ ఎంతో ప్రేమగా కొనియాడుతున్నారు. --ఈ స్థాయి అందం చూడటానికి రెండు కళ్లు చాలవు-- అంటూ, కొందరైతే --ఈ హాట్‌నెస్ చూస్తుంటే ఒక వార్నింగ్ ఇవ్వాల్సిందేమో-- అంటూ సరదాగా కామెంట్లు పెడుతున్నారు. కేవలం ధరించిన దుస్తులే కాకుండా... విదేశీ గడ్డపై నవ్‌నీత్ ఆత్మవిశ్వాసం, రాజసమైన నడక అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అభిమాన పేజీలు ఈ లుక్‌ను ఒక ఫ్యాషన్ ఎడిటోరియల్‌తో పోల్చాయి. లండన్ వీధుల్లో ఆమె ఇస్తున్న ఈ అదిరిపోయే -సర్వ్-కు అభిమానులు ఫిదా అవుతున్నారు.

ఓవరాల్ గా అవ్‌నీత్ కౌర్ తన లేటెస్ట్ రెడ్ కార్పెట్ లుక్‌తో మరోసారి ఫ్యాషన్ ఐకాన్‌గా నిరూపించుకున్నారు. గ్లోబల్ స్థాయిలో తనదైన ముద్ర వేస్తూ.. ప్రతి పోస్ట్‌తోనూ యువతలో క్రేజ్ పెంచుకుంటూ దూసుకుపోతున్నారు. ఈ బ్యూటిఫుల్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.




Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965